# సాక్షి సూర్యాపేట

బుధవారం । 1 । అక్టోబర్ । 2025





**డివైడర్‌ను ఢీకొట్టిన కారు..**
నేరేడచర్లలో కారు డివైడర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. - 10లో



**జంక్షన్ల విస్తరణకు చర్యలు**
ప్రమాదాలను నివారణకు హైవేపై జంక్షన్లు విస్తరించనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. - 10లో

**సాగర్ సమాచారం**



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

| | | |
|---|---|---|
| ప్రస్తుత నీటి మట్టం | : | 584.10 అడుగులు |
| ఇన్‌ఫ్లో | : | 5,81,628 క్యూసెక్కులు |
| అవుట్ ఫ్లో | : | 5,81,628 క్యూసెక్కులు |
| విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా | : | 32,805 క్యూసెక్కులు |
| కుడికాల్వ ద్వారా | : | 9,533 క్యూసెక్కులు |
| ఎడమకాల్వ ద్వారా | : | 6,556 క్యూసెక్కులు |
| ఏఎమ్మార్పీకి | : | 1,200 క్యూసెక్కులు |
| వరద కాల్వకు | : | నిల్ |

## న్యూస్‌రీల్

### రికార్డు స్థాయిలో జల విద్యుత్ ఉత్పత్తి



కేక్ కట్ చేస్తున్న సీఈ మంగేష్‌నాయక్

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లోని తెలంగాణ జెన్‌కో ప్రధాన విద్యుత్ ఉత్పాదన కేంద్రంలో విద్యుదుత్పాదన సంవత్సర లక్ష్యాన్ని ఆరు నెలల్లోనే పూర్తి చేసినట్లు నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్(సీఈ) మంగేష్‌నాయక్ తెలిపారు. మంగళవారం విద్యుదుత్పాదన ప్రధాన కేంద్రం పవర్ కంట్రోల్ రూమ్‌లో ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యుదుత్పాదన కేంద్రం మెయిన్ పవర్‌హౌస్ 2025–26 ఆర్థిక సంవత్సరపు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1,450 మిలియన్ యూనిట్లు కాగా.. మంగళవారం నాటికి(సెప్టెంబర్ 30) లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1,400 మిలియన్ యూనిట్లు లక్ష్యం కాగా.. 540 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1,400 మిలియన్ యూనిట్లు లక్ష్యానికి 1,922 మిలియన్ యూనిట్లు ఉత్పాదన చేసినట్లు తెలిపారు. ఆరు నెలల కాలంలోనే లక్ష్యాన్ని పూర్తి చేయడంపై ఇంజినీర్లను ప్రశంసించారు.

### సమస్యలు లేకుండా చూడాలని వినతి



కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేటలోని సద్దుల చెరువు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో హిందూ సంప్రదాయాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరుతూ మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జుట్టుకొండ మాట్లాడుతూ సద్దుల చెరువు వద్ద ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న (మహా ప్రస్థానం) శ్మశాన వాటికను అమృత్ పథకం కింద కేంద్రం పునర్నిర్మించిందన్నారు. గతంలో ఆరు ప్లాట్‌ఫాంలు ఉండగా ప్రస్తుతం మూడింటిని నిర్మించారని చెప్పారు. మున్సిపాలిటీ విస్తరిస్తున్నందున ఈ ప్లాట్‌ఫాంలు సరిపోవడం లేదన్నారు. అదేవిధంగా సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డికి కూడా వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చలమల్ల నర్సింహ, రాష్ట్రీయ వానరసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్వరం రవి చంద్ర, జుట్టుకొండ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహుడి నిత్యకల్యాణాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవి రాట్ శ్రీలక్ష్మీనరసింహ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల సంవాదం రక్తికట్టించారు. అనంతరం కల్యాణతంతు ముగించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. క్షేత్రపాలకుడైన శ్రీవీరాంజనేయ స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూర్‌రు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు క్రిష్ణమాచార్యులు,పద్మనాభాచార్యులు , బ్రహ్మాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి ,ఆంజనేయా చార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ నరసింహ, పోలీస్ అధికారులు

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ

సూర్యాపేటటౌన్ : దసరా పండుగను పురస్కరించుకొని మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో జిల్లా ఎస్పీ నరసింహ పాల్గొని ఆయుధాలు, పోలీస్ వాహనాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవడంలో భాగంగా ఆయుధ పూజా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, రవి, నరసింహాచారి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గాదేవిగా అమ్మవారు



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సూర్యాపేట పట్టణంలోని 36వ వార్డులో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు -సాక్షి ఫొటో గ్రాఫర్, సూర్యాపేట

# రిజర్వేషన్.. పరేషాన్!

## పలు గ్రామాల్లో పంచాయతీ పోరుకు అభ్యర్థులు కరువు

- పలుచోట్ల ఒకటీ రెండు కుటుంబాల వారికే దక్కిన రిజర్వేషన్
- గిరిజనులు ఉండే ప్రాంతాల్లోని సర్పంచ్ పదవులు బీసీలకు రిజర్వు
- ఇంకొన్ని చోట్ల ఒకరే అభ్యర్థి ఉండడంతో ఏకగ్రీవానికి అవకాశం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులతోపాటు వార్డు సభ్యుల కొరత కూడా నెలకొంది. దీంతో అభ్యర్థుల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు వెతుకులాటలో పడ్డాయి. కొన్నిచోట్ల ఒకటీ రెండు కుటుంబాలే ఉన్నా, వారికే ఆ స్థానాలు రిజర్వు అయ్యారు. దీంతో అక్కడ పంచాయతీలు ఏకగ్రీవం కానున్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో బీసీలకు సర్పంచ్ స్థానాలు రిజర్వు కాగా, అక్కడ బీసీ అభ్యర్థులే లేని విచిత్ర పరిస్థితి నెలకొంది. అలాంటి వాటిల్లో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారన్నది గందరగోళంగా మారింది. అభ్యర్థులే లేకుండా ఎలా ముందుకు వెళతారన్న దానిపైనా స్పష్టత రావాల్సి ఉంది.

**ఈ గ్రామాల్లో ఏకగ్రీవానికే అవకాశం**

- మఠంపల్లి మండలం సుల్తాన్పూర్ తండాలో 392 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో కేవలం ముగ్గురు మాత్రమే బీసీలు ఉన్నారు. ప్రస్తుతం అది బీసీకి రిజర్వు అయింది.
- మఠంపల్లి మండలం లాలితండా గ్రామపంచాయతీలో 425 మంది ఓటర్లు, 8 వార్డులు ఉన్నాయి. అది బీసీకి రిజర్వు అయింది. అయితే ఇక్కడ నలుగురే బీసీ ఓటర్లు ఉన్నారు.
- పెన్‌పహాడ్ మండలం చిన్న గారకుంట తండా గ్రామపంచాయతీలో 500 మంది ఓటర్లు ఉన్నారు. అయితే కేవలం 2 ఓట్లు మాత్రమే బీసీలకు ఉన్నాయి. ఇక్కడ గ్రామపంచాయతీ బీసీకి రిజర్వ్ అయింది.
- అడవిదేవులపల్లి మండలంలోని జిలకరకుంటతండా గ్రామ పంచాయతీ గతంలో ఎస్టీ జనరల్ కాగా ఈ సారి బీసీ మహిళకు రిజర్వు అయింది. ఆ గ్రామంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబం ఒక్కటే ఉంది.
- గోన్యతండా గతంలో ఎస్టీ మహిళ కాగా ఈ సారి బీసీ జనరల్ రిజర్వు అయింది. అక్కడ కేవలం బీసీ సామాజిక వర్గం నుంచి రెండు కుటుంబాలు మాత్రమే ఉన్నాయి.
- ముదిమాణిక్యం గతంలో జనరల్ మహిళ కాగా ఈ సారి ఎస్టీ జనరల్‌గా రిజర్వేషన్ అయింది. ఈ గ్రామంలో రెండు మాత్రమే ఎస్టీ కుటుంబాలు ఉన్నాయి.
- దామరచర్ల మండలంలోని తూర్పుతండా బీసీలకు రిజర్వ్ అయ్యింది. ఇక్కడ ఒక్క కుటుంబమే ఉంది.
- మాడుగులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఎస్టీకి రిజర్వ్ అయింది. గ్రామంలో మొత్తం 1925 మంది ఓటర్లు ఉండగా అందులో కేవలం బానోతు శాంతి, బోడ నవీన్ అనే ఎస్టీలకు మాత్రమే ఓట్లు ఉన్నాయి.
- గజలాపురం గ్రామపంచాయతీ ఎస్టీకి రిజర్వ్ చేశారు. గ్రామంలో ఎస్టీ కుటుంబం ఒక్కటే ఉంది. అయితే ఇక్కడ ఎస్టీలకు రెండు వార్డులు కేటాయించారు.
- పెద్దవూర మండలంలో పులిచర్ల పంచాయతీ ఎస్టీ మహిళకు కేటాయించారు ఇక్కడ ఎస్టీలకు సంబంధించి ఐదు ఓట్లు మాత్రమే ఉన్నాయి.
- చందంపేట మండలంలోని గుంటిపల్లి బీసీకి రిజర్వ్ అయింది. ఇక్కడ బీసీ కుటుంబం ఒక్కటే ఉంది. మరో కుటుంబంలో భర్త బీసీ, భార్య ఎస్టీ ఉన్నారు.
- దేవరకొండ మండలం దుబ్బతండా గ్రామపంచాయతీ బీసీ మహిళకు రిజర్వు అయింది. అయితే అక్కడ బీసీ మహిళ ఒక్కరే ఉన్నారు.
- వెంకటితండా బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. అయితే అక్కడ మూడే బీసీ ఓట్లు ఉన్నాయి.

**ఇక్కడ అసలు అభ్యర్థులు లేరు..**

- దామరచర్ల మండలంలో జైత్రాంతండా, బాండావత్‌తండా, గోన్యతండా, బాలాజీనగర్‌తండా, మాన్‌తండా, నూనావత్‌తండాలే బీసీలకు రిజర్వ్ అయ్యాయి. కానీ ఈ తండాల్లో బీసీ ఓటర్లే లేరు. అక్కడ సర్పంచ్ పదవి నామినేషన్ వేసే వారే లేకుండాపోయారు.
- అడవిదేవులపల్లి మండలంలోని చాంప్లాతండా గతంలో ఎస్టీ జనరల్ కాగా ఈ సారి బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. అక్కడ ఒక్క బీసీ కూడా లేరు.
- తిరుమలగిరి(సాగర్) మండలంలో చింతలపాలెం గ్రామపంచాయతీ ఎస్టీ జనరల్‌గా రిజర్వు అయింది. అయితే అక్కడ ఎస్టీలు ఒక్కరూ లేరు.

**బీసీ జనరల్‌కు రిజర్వు.. ఉన్నది భార్యాభర్త ఇద్దరే**

చివ్వెంల మండలంలోని జగనాతండాలో 580 మంది ఓటర్లు ఉన్నారు. ఈతండాలో 8 వార్డులు ఉన్నాయి. ఇక్కడ భార్యాభర్తలు ఇద్దరే బీసీలు. ప్రస్తుతం ఈ గ్రామం బీసీ జనరల్‌కు రిజర్వు అయింది.

**మహిళకు రిజర్వు.. ఒక్కరూ లేరు**

నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని అనుముల మండలం పేరూర్ గ్రామ సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. పేరూర్ గ్రామ పంచాయతీలో 792 మంది ఓటర్లలో ఒకే ఒక్క ఎస్టీ పురుషుడికే ఓటు హక్కు ఉంది. అయితే ఇక్కడ సర్పంచ్ స్థానం ఎస్టీ మహిళ రిజర్వు అయింది. దీంతో అభ్యర్థేలేని పరిస్థితి నెలకొంది.

## అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జెడ్పీటీ, గ్రామపంచాయతీ ఎన్నికలకు షెడ్యూలు ప్రకటించినందున సోమవారం నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియా ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉన్న మూడు డివిజన్లలోని 23 మండలాల జెడ్పీటీసీలు, 235 ఎంపీటీసీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 486 గ్రామపంచాయతీలు, 4388 వార్డు సభ్యులకు ఎన్నికలు ఉంటాయని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు 4,403 పోలింగ్ కేంద్రాలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు 1,272 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 541 పోలింగ్ ప్రాంతాలు, 6,94,815 మంది ఓటర్లు ఉన్నారని ఆయన వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బందికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్టేజ్–1, స్టేజ్ –2 అధికారులకు శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయగా, ఆర్‌ఓ, పీఓల శిక్షణ కార్యక్రమాలు మండలాల వారిగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి ప్రచురించే విషయంలో ప్రింటింగ్ ప్రెస్ లు పూర్తి వివరాలను ప్రదర్శించాలన్నారు. మీడియాలో వచ్చే చెల్లింపు వార్తలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని, అలాంటి వార్తల వ్యయాన్ని అభ్యర్థి ఖాతాలో ఖర్చుగా చూపించనున్నట్లు చెప్పారు. మీటింగ్‌లు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఎలాంటి ప్రభుత్వ పథకాల మంజూరు, గ్రౌండింగ్, ప్రారంభోత్సవాలు ఉండవని, జిల్లా కలెక్టర్ మొదలుకొని కిందిస్థాయి వరకు అందరూ ఎన్నికల కమిషన్ పరిధిలో పనిచేస్తారని చెప్పారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం మొత్తం సంసిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ యాదగిరి, నల్లగొండ అసిస్టెంట్ డైరెక్టర్, సూర్యాపేట డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా సమాచార ఇంజనీర్ మల్లేశం, డిప్యూటీ సీఈఓ శిరీష, డివిజనల్ పంచాయతీ అధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవలో ముందుండాలి



సామూహిక జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

కోదాడరూరల్ : రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవలో ముందుండాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య కోరారు. సెప్టెంబర్ నెలలో పుట్టిన రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను మంగళవారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడారు. శేష జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి పందిరి రఘువరప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, పొట్ట జగన్మోహన్‌రావు, వీరబాబు, జానయ్య, యజ్దాని, భ్రమరాంబ, భూపాల్‌రెడ్డి, హాజీనాయక్ పాల్గొన్నారు.

## బుద్ధవనాన్ని సందర్శించిన అమ్రాబాద్ సీసీఎఫ్

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని మంగళవారం అమ్రాబాద్ ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్(సీసీఎఫ్) సునీల్ హిరామత్ కుటుంబసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనంలోని బుద్ధ చరితవనం, ధ్యానవనం, స్థూప వనం, మహాస్థూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరాన్ని సందర్శించి ధ్యానం చేశారు. వీరికి బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రు బుద్ధవనం బ్రోచర్లను అందజేశారు. అనంతరం వీరు సాగర్ జలాశయంలో లాంచీలో విహరించారు. వీరితో పాటు ఒడిశాకు చెందిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు చెందిన మరో అధికారి విశ్వనాథ్ నీల్ అన్వార్ కూడా ఉన్నారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం విశేషాలను, సాగర్ వివరాలను వివరించారు.

## రసాభాసగా ఎర్రవరం పీఏసీఎస్ సమావేశం

- సంఘం డబ్బులు వాడుకున్నాడని చైర్మన్‌ను నిలదీసిన సభ్యులు
- పోలీస్ పహారాలో సమావేశం

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని ఎర్రవరం పీఏసీఎస్‌లో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ సంఘానికి సంబంధించిన డబ్బులను గతంలో రూ.8లక్షలను వాడుకున్నాడని వాటిలో రూ.4.10లక్షలను ఓసారి చెల్లించాడని మిగిలిన రూ.3.90లక్షలను సర్వసభ్య సమావేశం నాటికి కట్టేందుకు ఒప్పుకున్నాడని తెలిపారు. అయితే చైర్మన్ ఆ డబ్బులకు సంబంధించిన అసలు మాత్రమే కట్టడంతో వడ్డీతో సహా చెల్లించాలని చైర్మన్‌ను సంఘ సభ్యులు, రైతులు డిమాండ్ చేశారు. సంఘం నుంచి ఎడ్యుకేషన్ టూర్ పేరు మీద రూ.72వేలకు అనుమతి తీసుకొని అదనంగా రూ.28వేలను ఎందుకు వాడుకున్నారని, ఆరు నెలల్లో సాధారణ ఖర్చుల కింద వాడుకున్న రూ.40వేల లెక్కలు చూపించాలని చైర్మన్‌ను నిలదీశారు. రూ.2.50కోట్లకు పైగా గోల్డ్ లోన్ ఉంటే ఎందుకు లాకర్‌కు ఇన్సూరెన్స్ చేయించలేదని, దీంతో పాటుగా ఇటీవల రిటైర్డ్ అయిన సీఈఓకు రావాల్సిన బెనిఫిట్స్ ను రాకుండా ఎందుకు ఆపుతున్నావని వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ పరిస్థితి ఘర్షణ వాతావరణం నెలకొనడంతో విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ 10 మంది సిబ్బందితో అక్కడికి చేరుకొని గొడవ జరగకుండా ఆపారు. ఆ తర్వాత పోలీసుల పహారాలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులతో పాటు ఎర్రవరం, రామలక్ష్మీపురం, బీక్యాతండా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజ నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయాల్లో సిందూరంతోపాటు పాలతో మన్యసూక్త పారాయణములతో అభిషేకం జరిపారు. అనంతరం సుగంధం వెదజల్లే ద్రవ్యాలు, పూలతో అలంకరించి, నాగవల్లి దళార్చన చేపట్టారు. ఇక ప్రధానాలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవలు వంటి పూజలు కొనసాగాయి.




26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

## సాగర్‌కు భారీగా వరద

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద పోటెత్తుతోంది. ఎగువ నుంచి సాగర్ జలాశయంలోకి 5,81,628 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా 5,31,534 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 32,805 క్యూసెక్కులు.. మొత్తం 5,64,339 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు.

# కొత్త పనులకు బ్రేక్..!

- అమలులోకి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్
- రాజకీయ పార్టీల సమావేశాలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు బంద్
- ఎన్నికల సంఘం పరిధిలోకి జిల్లా యంత్రాంగం



కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు.

భానుపురి (సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటనతో జిల్లాలో కొత్త పనులకు బ్రేక్ పడనుంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల నోటిఫికేషన్ రాగానే.. ప్రభుత్వపరంగా ఎలాంటి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించడానికి వీలు లేకుండా పోనుంది. ఇప్పటికే అమలులో ఉన్న పాత పథకాలు, పనులు మాత్రం యథావిధిగా కొనసాగనున్నాయి. జిల్లా యంత్రాంగమంతా దాదాపు ఎన్నికల సంఘం పరిధిలోకి వెళ్లింది. స్థానిక సంస్థల సమరం ముగిసే వరకు ఎన్నికల సంఘం ఆదేశాలనే పాటించాల్సి ఉంది.ఈ మేరకు మంగళవారం రాజకీయ పార్టీలతో ఎన్నికల కోడ్‌పై మండల స్థాయిలో జిల్లావ్యాప్తంగా సమావేశాలను నిర్వహించారు. అలాగే జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుపై ఎన్నికల సంఘం సూచనల మేరకు

**అనుమతి తప్పని సరి**

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ఏ సమావేశం, ర్యాలీకైనా ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సమయంలో ఎలాంటి నిబంధనలు ఉంటాయో.. అదేవిధంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం వర్తించనున్నాయి. అభ్యర్థుల ఖర్చులపై నిఘా సైతం ఉండనుంది. ప్రకటనలు, గోడలపై రాతలు రాయించే సమయంలోనూ ఎన్నికల సంఘం అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

**బోనస్ అందేనా!**

గత యాసంగి సీజన్‌లో జిల్లాలో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా.. దాదాపు 50,992 మంది రైతులకు రూ.25.17 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్‌తో ఈ బోనస్ చెల్లింపులకు ఏమైనా ఇబ్బందులు ఉంటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నాలుగు నెలలుగా రైతులు బోనస్ కోసం ఎదురు చూస్తుండగా.. ఎన్నికల నిబంధనలు అడ్డంకిగా మారితే మరో 45రోజుల పాటు వేచిచూడాల్సిందే.

**అదనంగా మంజూరైన ఇళ్ల పరిస్థితి..**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఎలాంటి కొత్త పనులు చేపట్టేందుకు వీలుండదు. 486 గ్రామ పంచాయతీల పరిధిలో సీసీరోడ్ల నిర్మాణం నుంచి నూతన భవనాల వరకు ఏ ఒక్క కొత్త నిర్మాణం ఈ ఎన్నికల కోడ్ కారణంగా చేపట్టకూడదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున మంజూరు చేసింది. ఈ ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపనలు చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అయితే నూతనంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని తెలుస్తోంది. ప్రొసీడింగ్ కాపీలు అందుకున్న లబ్ధిదారుల పరిస్థితిపై స్పష్టత లేదు. జిల్లాకు నియోజకవర్గానికి 3500ల చొప్పున ఇళ్లు మంజూరు కాగా.. అదనంగా ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఇంతలోనే ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఇళ్ల మంజూరు, లబ్ధిదారుల ఎంపిక నిలిచిపోనుంది.

## క్లుప్తంగా

### నలభై తులాల బంగారం, నగదు అపహరణ

సూర్యాపేటటౌన్: ఇంట్లో దాచిన 40తులాల బంగారం, రూ.8లక్షల నగదు చోరీకి గురైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు బొబ్బ సువర్చలాదేవి, ఆమె కుమారులు కలిసి ఇంట్లో 40తులాల బంగారం(నాలుగు బిస్కెట్లు), రూ.8లక్షల నగదు భద్రపరిచారు. సువర్చలాదేవి కుమారులు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. వృద్ధురాలిని చూసుకునేందుకు కరీమా బేగం అనే మహిళను కేర్ టేకర్‌గా పెట్టుకున్నారు. మూడు రోజుల క్రితం బంగారం బిస్కెట్లు, నగదును బ్యాంకు లాకర్‌లో పెట్టేందుకు చూడగా అవి కనిపించలేదు. దీంతో సోమవారం వృద్ధురాలి కుమారుడు బొబ్బ నాగేంద్రప్రసాద్ సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేర్ టేకర్‌గా పనిచేస్తున్న మహిళపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశాడు. పోలీసులు కరీమా బేగంను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటయ్య తెలిపారు.

### కలెక్టర్ తనిఖీకొస్తే తాళం వేసి ఉన్న పల్లె దవాఖానా

- ఎంఎల్‌హెచ్‌పీకి షోకాజ్ నోటీసులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో గల ఆరోగ్య ఉపకేంద్రం (పల్లె దవాఖానా)లో పనిచేస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ)కి జిల్లా కలెక్టర్ హనుమంతరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సమయంలో పల్లె దవాఖానాకు తాళం వేసి ఉంది. సిబ్బంది కూడా ఎవరూ లేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఆగ్రహించిన కలెక్టర్ వెంటనే ఎంఎల్‌హెచ్‌పీకి షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఫోన్ ద్వారా జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు.



# బొమ్మలతో సులభంగా బోధించేలా..

- జాతీయ స్థాయి శిక్షణలో పాల్గొన్న గొలనుకొండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు జ్యోతిర్మయి

ఆలేరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. పాఠ్యాంశాలను బొమ్మలతో బోధించేందుకు గాను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో దశలవారీగా ప్రత్యేక శిక్షణ ఇస్తోంది.

**యాదాద్రి భువనగిరి నుంచి..**

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధీనంలోని సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రెనింగ్(సీసీఆర్‌టీ) ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగిన ఈ జాతీయ స్థాయి శిక్షణకు తెలంగాణ రాష్ట్రం నుంచి 9 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఆలేరు మండలం గొలనుకొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఏ. జ్యోతిర్మయి కూడా ఉన్నారు.

**ఇతర రాష్ట్రాల బోధనా పద్ధతులపై శిక్షణ**

ఈ జాతీయ స్థాయి శిక్షణలో దేశంలోని పలు రాష్ట్రాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న వినూత్న బోధనా పద్ధతులు, బొమ్మలతో బోధన, స్వయంగా బొమ్మల తయారీ గురించి నేర్చుకున్నట్లు ఉపాధ్యాయురాలు జ్యోతిర్మయి పేర్కొన్నారు. అంతేకాకుండా తెలంగాణ ఉద్యమం, ఉద్యమకారులు, చారిత్రాక కట్టడాలు, బోనాలు, బతుకమ్మ, ఇక్కడి విద్యా బోధన తీరు తదితర విషయాల గురించి ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులకు వివరించినట్లు ఆమె తెలిపారు. సీసీఆర్‌టీ సంచాలకులు రాజ్‌కుమార్ జ్యోతిర్మయికి ధ్రువపత్రాన్ని అందజేశారు.



శిక్షణలో భాగంగా బొమ్మలు తయారు చేస్తున్న ఉపాధ్యాయురాలు జ్యోతిర్మయి



ఇతర రాష్ట్రాల టీచర్లతో కలిసి బొమ్మల తయారీలో పాల్గొన్న జ్యోతిర్మయి

**హాజరుశాతం పెంచడమే లక్ష్యం**



విద్యార్థులకు సులభంగా బొమ్మల ద్వారా పాఠాలు బోధించడం ఎలా అనేది జాతీయ స్థాయి శిక్షణలో నేర్పించారు. పాఠ్యాంశాల్లోని పాత్రల ప్రకారం స్వయంగా బొమ్మలు తయారు చేసుకోవడం కూడా తెలిసింది. ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులు అనుసరిస్తున్న వినూత్న బోధన పద్ధతుల గురించి తెలుసుకున్నాను. తెలంగాణలోని బోధన విధానాన్ని వేరే రాష్ట్రాల టీచర్లకు వివరించాను. శిక్షణలో భాగంగా రుద్రమదేవి వేషధారణతో పాఠ్యాంశం బోధించే అవకాశం నాకు దక్కింది. విద్యార్థుల్లో పాఠాలు వినాలనే ఆసక్తిని పెంపొందించి, తద్వారా సర్కారు బడుల్లో హాజరుశాతం పెంచడమే నా లక్ష్యం. త్వరలో జిల్లాలోని ఉపాధ్యాయులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బొమ్మలతో బోధనపై అవగాహన కల్పిస్తాను.

– ఏ. జ్యోతిర్మయి, ఉపాధ్యాయురాలు, గొలనుకొండ ప్రాథమిక పాఠశాల, ఆలేరు

# దసరా పండుగకు అత్తగారింటికి వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
- భార్య, పిల్లలకు గాయాలు

చౌటుప్పల్ రూరల్: దసరా పండగకు భార్యాపిల్లలతో కలిసి బైక్‌పై అత్తగారింటికి వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దామెరా గ్రామ పరిధిలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన మహంకాళి సురేష్(40) తన భార్య కవిత, కుమారులు యశ్వంత్, గౌతమ్‌తో కలిసి దసరా పండుగకు తన అత్తగారి ఊరైన సంస్థాన్ నారాయణపురం మండలం లింగావారిగూడేనికి బైక్ వెళ్తున్నాడు. చౌటుప్పల్ మండలం దామెరా గ్రామ శివారులోకి రాగానే మూల మలుపు వద్ద నారాయణపురం వైపు నుంచి వస్తున్న కారు వీరి బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సురేష్ మృతిచెందాడు. గాయపడిన కవిత, యశ్వంత్, గౌతమ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

## వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



లక్ష్మయ్య (ఫైల్)



సైదులు (ఫైల్)

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండలంలో మంగళవారం వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. వివరాలు.. పెన్‌పహాడ్ మండలం అనాజీపురం గ్రామానికి చెందిన దూబని లక్ష్మయ్య(35) తన వ్యవసాయం క్షేత్రంలో పశువుల మేత కోసం గడ్డి కోస్తుండగా.. మోటారుకు అనుసంధానించిన కరెంట్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య భవాని, కుమారుడు ఉన్నారు. అదేవిధంగా చీదెళ్ల గ్రామానికి చెందిన సురభి సైదులు(46) ఇంట్లోని దండెం తీగకు చేపలు ఎండపెడుతుండగా విద్యుత్ సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఈ రెండు ఘటనలకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

## కుటుంబ సమస్యలతో ఉరేసుకుని ఆత్మహత్య



ఆవుల నరేష్

గుర్రంపోడు: కుటుంబ సమస్యలతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం చామలేడు గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. చామలేడు గ్రామానికి చెందిన ఆవుల నరేష్(28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నరేష్ మంగళవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ పనికి వెళ్లిన నరేష్ తల్లి ఇంటికి వచ్చి తలుపులు తీసి చూడగా అప్పటికే అతడు మృతిచెందాడు. కుటుంబ సమస్యలతోనే నరేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## జాతీయ రహదారిపై జంక్షన్ల విస్తరణకు చర్యలు

- ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి



బొర్రోళ్లగూడెం జంక్షన్ విస్తరణకు సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించడానికి ఎన్‌హెచ్ఏఐ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు జంక్షన్ల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం గ్రామం వద్ద ఉన్న జంక్షన్‌ను ఎన్‌హెచ్ఏఐ అధికారులతో కలిసి ఏసీపీ పరిశీలించి మాట్లాడారు. దండుమల్కాపురం పరిధిలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్ ఉండడంతో భారీ ట్యాంకర్లు రోడ్డు క్రాస్ చేసే సమయంలో హైవేపై ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దండుమల్కాపురం, బొర్రోళ్లగూడెం, కైతాపురం గ్రామాల వద్ద ఉన్న జంక్షన్లను విస్తరిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్ సహకారంతో విస్తరణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. హైవేపై ప్రయాణించే వాహనాల వేగం జంక్షన్ల వద్ద తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారి ఇంజనీరింగ్ విభాగం అధికారులు కిషన్‌రావు, శరత్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్ డీజీఎం విశ్వేశ్వరరావు, చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయ్‌మోహన్ పాల్గొన్నారు.

### తాళం వేసిన ఇళ్లలో చోరీ

మోత్కూరు: మోత్కూరు పట్టణంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం చెంతనే ఉన్న దంతూరి భాను ఇంట్లో అద్దెకు ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు సైదులు, యాదగిరి తమ పోర్షన్లకు తాళాలు వేసి దసరా పండుగకు ఊరెళ్లారు. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సైదులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 1.75 తులాల బంగారం, యాదగిరి ఇంట్లో రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడేశారు. మంగళవారం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## బాస్కెట్‌బాల్ క్రీడాకారిణికి సన్మానం



బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి విహారెడ్డిని సన్మానిస్తున్న గారెకుంటపాలెం గ్రామస్తులు

మాడుగులపల్లి: మాడుగులపల్లి మండలం గారెకుంటపాలెం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వెంకట్‌రెడ్డి కుమార్తె విహారెడ్డి మలేషియాలో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో అండర్–16 బాస్కెట్‌బాల్ పోటీల్లో భారత జట్టు తరఫున వైస్ కెప్టెన్‌గా బరిలోకి దిగింది. ఈ క్రమంలో ఇరాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. దీంతో మంగళవారం గారెకుంటపాలెం గ్రామంలో విహారెడ్డిని గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విహారెడ్డి చిన్నతనం నుంచే బాస్కెట్‌బాల్ క్రీడలో రాణించి జాతీయ జట్టుకు ఎంపికై భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రత్నమాల, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు

నేరేడుచర్ల: కారు డివైడర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున నేరేడుచర్ల పట్టణంలో జరిగింది. స్థానిక ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ధర్మవరపాడుకు చెందిన ఫొటోగ్రాఫర్ నిమ్మతోట తనూజ్ కుమార్(27) తన స్నేహితులు ఎస్‌కే నహీం, మాసిబోయిన నరహరి, తోము లోకేష్‌తో కలిసి సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో ఓ ఈవెంట్‌కు సంబంధించి ఫొటోగ్రఫీ గురించి మాట్లాడేందుకు సోమవారం రాత్రి కారులో వచ్చారు. ఈవెంట్ గురించి మాట్లాడిన అనంతరం తాగునీటి కోసం మంగళవారం తెల్లవారుజామున నేరేడుచర్లకు చేరుకొని ఓ టీస్టాల్ వద్ద ఆగారు. టీస్టాల్ ముందు కారులో నుంచి లోకేష్‌ను దింపి యూటర్న్ తీసుకొని వస్తామంటూ మిర్యాలగూడ రోడ్డులోని హెచ్‌పీ బంక్ వైపు వెళ్తూ రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తనూజ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ఉన్న నహీం, నరహరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు నిమ్మతోట తరుణ్‌గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కృష్ణా నదిలో విద్యార్థి గల్లంతు



చాణక్య (ఫైల్)

నాగార్జునసాగర్: స్నేహితులతో కలిసి మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును చూసేందుకు వచ్చిన ఇంటర్మీడియట్ విద్యార్థి కృష్ణా నదిలో గల్లంతయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన హర్షవర్ధన్, జ్ఞానేందర్, సుమన్, మణికంఠరెడ్డి, వెంకటేష్, చాణక్య (16)స్నేహితులు. వీరంతా వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్నారు. వీరంతా కలిసి నాగార్జునసాగర్‌ను చూడటానికి మంగళవారం రెండు బైక్‌లపై వచ్చారు. అందరూ కలిసి నాగార్జునసాగర్ డ్యాం దిగువన ఫొటోలు తీసుకున్నారు. అనంతరం కొత్త బ్రిడ్జి సమీపంలో చింతలపాలెం వెళ్లే దారి వెంట ఉన్న ఆంజనేయ పుష్కర ఘాట్‌లోకి దిగి స్నానాలు చేస్తుండగా.. చాణక్య నీటి ఉధృతికి కృష్ణా నదిలో కొట్టుకుపోయాడు. అతడి స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు గజ ఈతగాళ్లతో కృష్ణా నది తీరం వెంట గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం వరకు కూడా గల్లంతైన విద్యార్థి ఆచూకీ లభించలేదు.

## పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికి..

- కలప తరలించేందుకు యత్నించిన గుర్తుతెలియని వ్యక్తులు
- అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి

ఆలేరురూరల్: ఆలేరు మండలం కొలనుపాక గ్రామం పల్లె ప్రకృతి వనంలోని చెట్లను మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు నరికి కలప తరలించేందుకు యత్నించారు. కొలనుపాక గ్రామంలో 2020లో ఎకరం ప్రభుత్వ స్థలంలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అందులో చెట్లు ఏపుగా పెరిగాయి. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చెట్లను కోసే మిషన్ల సహాయంతో పల్లె ప్రకృతి వనంలోని దాదాపు 200 కోనోకార్పస్ చెట్లను నరికి వాటిని డీసీఎంలో తరలించేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పల్లె ప్రకృతి వనం వద్దకు వెళ్లి అడ్డుకున్నారు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### 3 నుంచి స్వర్ణగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న ఉత్సవారంభ స్నపనం, పెద్ద శేష వాహన సేవ, 4న గజ వాహన, హనుమంత వాహన సేవలు, 5న కల్పవృక్ష వాహన, చంద్రప్రభ వాహన సేవలు, 6న చిన్న శేష వాహన, సర్వభూపాల వాహన సేవలు, 7న అష్టోత్తర శత కళశాభిషేకం, మహాకుంభ సంప్రోక్షణ, గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి దివ్య మంగళ శాసనాలతో నిర్వహించే ఈ పవిత్రోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టొద్దు

- సూర్యాపేట ఎస్పీ నరసింహా



నగదు జమ చేయించినట్లు కోర్టు ఉత్తర్వులు అందజేస్తున్న ఎస్పీ నరసింహా

సూర్యాపేటటౌన్ : అనవసరమైన లింక్‌లను అనుసరించి ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టొద్దని సూర్యాపేట ఎస్పీ కె. నరసింహా సూచించారు. సైబర్ మోసాలకు గురై డబ్బులు పోగొట్టుకున్న ముగ్గురి బాధితుల ఖాతాల్లో రూ.28లక్షల నగదును తిరిగి జమ చేయించి వారికి కోర్టు ఉత్తర్వులను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతాదారుడి మొబైల్ ఫోన్‌కు బిజినెస్ ఆఫర్ ఉందని మెసేజ్ వచ్చిందని, బాధితుడు మెసేజ్‌ను అనుసరిస్తూ సైబర్ నేరగాళ్లు సూచించిన విధంగా అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి సుమారు రూ.37 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టిన అనంతరం ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ సెక్యూరిటీ టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేయగా.. సూర్యాపేట జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్, పట్టణ పోలీసులు అప్రమత్తమై సంబంధిత బ్యాంకు వారిని అతడి అకౌంట్ నుంచి బదిలీ అయిన నగదులో రూ.26.42 లక్షల నగదు హోల్డ్ చేయించినట్లు ఎస్పీ తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆ నగదు మహారాష్ట్రకు చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా, పశ్చిమబెంగాల్‌కు చెందిన బంధన్ బ్యాంక్ వినియోగదారుల ఖాతాలకు బదిలీ అయ్యిందని గుర్తించి కోర్టు ఆర్డర్స్ ద్వారా తిరిగి బాధితుడికి ఇప్పించినట్లు తెలిపారు. ఇదేవిధంగా మరో వ్యక్తికి రూ.51వేల నగదు, ఇంకొక వ్యక్తికి రూ.90వేలు వారి అకౌంట్లలోకి వేసినట్లు ఎస్పీ వివరించారు. డబ్బులు తిరిగి పొందిన బాధితులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కమ్యునికేషన్స్ హెడ్ కానిస్టేబుల్ మహేష్, కానిస్టేబుల్ మహేష్ చారి, రాజేష్, సైదులు, నాగయ్య పాల్గొన్నారు.

## హైవేపై అదుపుతప్పిన యాసిడ్ ట్యాంకర్



తూఫాన్ వాహనాలపై బోల్తాపడిన యాసిడ్ ట్యాంకర్

- సర్వీస్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలపై బోల్తా
- ట్యాంకర్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసిన పోలీసులు, స్థానికులు
- ఆస్పత్రికి తరలింపు
- చౌటుప్పల్ పట్టణంలో ఘటన

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం యాసిడ్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు పారిశ్రామికవాడ నుంచి మంగళవారం యాసిడ్‌ను లోడ్ చేసుకున్న ట్యాంకర్ ఏపీలోని పల్నాడు జిల్లా దాచేపల్లి ప్రాంతంలోని ఓ పరిశ్రమలో అన్‌లోడ్ చేసేందుకు బయల్దేరింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన ట్యాంకర్ డ్రైవర్ రాములు రాత్రి 7.30 గంటల ప్రాంతంలో చౌటుప్పల్ పట్టణానికి చేరుకోగానే ముందున్న వాహనాల రద్దీని గుర్తించి బ్రేకులు వేసే ప్రయత్నం చేశాడు. ట్యాంకర్ వేగంతో ఉండడంతో బ్రేకులు పడలేదు. దీంతో చేసేదేమీ లేక ముందుకు వెళ్తే ప్రాణనష్టం జరుగుతుందన్న ఆలోచనతో ట్యాంకర్ డ్రైవర్ ఒక్కసారిగా ఎడమ వైపుకు తిప్పాడు. ఈ క్రమంలో ముందున్న రెండు కార్లను ఢీకొట్టాడు. హైవే వెంట ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను ఢీకొని సర్వీస్ రోడ్డులోకి వెళ్లి అక్కడ పార్కింగ్ చేసి ఉన్న రెండు తూఫాన్ వాహనాలపై బోల్తా పడి ఆగిపోయింది.

**క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్**

ప్రమాద సమయంలో ట్యాంకర్‌లో డ్రైవర్‌తో పాటు నేరేడుచర్లకే చెందిన క్లీనర్ నవీన్ ఉన్నారు. డ్రైవర్ రాములకు తీవ్ర గాయాలై ట్యాంకర్ క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. యాసిడ్ ట్యాంకర్ రెండు తూఫాన్ వాహనాలపై బోల్తా పడడంతో పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ఒక్కో వాహనానికి రూ.11లక్షల చొప్పున నష్టపోయామని వాహనాల యజమానులు సిలివేరు శివ, కవిడె నర్సింహ బోరున విలపించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్యాంకర్ బోల్తా పడిన సమయంలో అందులోని యాసిడ్ లీకై రోడ్డుపై పారింది.

**తప్పిన ప్రాణనష్టం**

ప్రమాదం జరిగిన సమయంలో తూఫాన్ వాహనంలో, వాహనాల పక్కన డ్రైవర్లు, స్థానికులు సుమారు 20మంది నిల్చున్నారు. ఈ ఘటన జరగడానికి రెండు నిమిషాల ముందే వారంతా అక్కడి నుంచి వెళ్లి సమీపంలోని దుకాణాల కూర్చున్నారు. లేదంటే భారీగా ప్రాణనష్టం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.